శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు : డీఎం

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్మల్ డిపో నుంచి సుప్రసిద్ధ శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు మేనేజర్ ప్రతిమారెడ్డి తెలిపారు. కదిలి, కాల్వ, బూరుగుపెల్లి తదితర ప్రాంతాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపిస్తామని పేర్కొన్నారు. అవసరాన్ని బట్టి పెంచుతామని ప్రయాణికులు ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలని కోరారు. బస్సులు ఎలాంటి బ్రేడ్ డౌన్ లేకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, ఏఈ నవీన్‌కుమార్, తదితర అధికారులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటను సాగు చేస్తున్న దృశ్యం



రైతులందరికీ అందని భరోసా

నిర్మల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అట్టహాసంగా అమలు చేస్తున్న రైతుభరోసా పథకం పూర్తిస్థాయిలో అమలుకాకపోవడం పట్ల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు కేవలం 75వేల మందికి మాత్రమే రైతుభరోసాకు సంబంధించిన డబ్బులు వారి ఖాతాల్లో జమైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో మొత్తం 1.91లక్షల మంది రైతులు ఉన్నారు. వారి భూములకు సంబంధించి 250 కోట్ల రూపాయలు రైతుభరోసా కింద అందించాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు కేవలం 75,101 మంది రైతులకు రూ.51.73 కోట్లను మాత్రమే రైతుభరోసా కింద బ్యాంకుఖాతాల్లో జమ చేశారు. అయితే రైతుభరోసా పథకం వర్తింపజేసేందుకు పంటల నమోదు ప్రక్రియను కూడా అధికారులు పరిగణలోకి తీసుకున్నట్లు చెబుతున్నారు. జిల్లాలో మొట్టమొదటి సారిగా డిజిటల్ పంట నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. మొత్తం 1.52.888 లక్షల ఎకరాలను డిజిటల్ సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 30వేల ఎకరాలను మాత్రమే సర్వే చేశారు. మిగతా పంట భూ ములు ఎప్పట్లోగా సర్వేను పూర్తి చేస్తారనే విషయం ఇప్పటికి అంతుచిక్కడం లేదు. ఈసారి రబీసీజన్‌లో 2.84.736 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేశారు. ప్రధానంగా 1.05.987 లక్షల ఎకరాల్లో వరిపంట, 1.02.590 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంట, 55,704 ఎకరాల్లో శనగపంటను రైతులు సాగుచేశారు. పంట ల నమోదు ప్రక్రియను మండల వ్యవసాయాధికారులు అలాగే విస్తరణ అధికారులు చేపడుతున్నారు. క్షేత్రస్థాయిలో భూముల వివరాలు సక్రమంగా లేకపోవడం, కొన్ని చోట్ల రాజకీయ ఒత్తిళ్లు వస్తుండడంతో పాటు స్థానికుల నుంచి కూడా పూర్తిస్థాయిలో సహకారం లభించకపోతున్నందున డిజిటల్ పంటల సర్వే ప్రక్రియ ముందుకు సాగడం లేదంటున్నారు. 1.20లక్షల ఎకరాలకు పైగా భూములను ఇంకా డిజిటల్ సర్వే చేయాల్సి ఉంది. ఈ సర్వే పూర్తయితే ఏఏ ప్రాంతంలో ఎంత మేరకు పంటలు సాగవుతున్నాయనే అంశం వెల్లడికానుంది.

- జిల్లాలో ఇంకా పూర్తి స్థాయిలో అమలు కాని 'రైతు భరోసా'
- 1.91లక్షల మంది రైతులకు గాను ఇప్పటివరకు 75వేల మందికి మాత్రమే వర్తింపు
- ఆందోళనలో జిల్లాలోని మిగతా రైతులు
- స్పష్టత ఇవ్వని అధికారులు

కొనసాగుతున్న పంటల నమోదు ప్రక్రియ

కాగా ఇదిలా ఉండగా జిల్లాలో పంటల నమోదు ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. ఇప్పటి వరకు 17,528 ఎకరాల్లో వరిపంట సాగునమోదైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. 149 ఎకరాల్లో కందుల పంట, 40 ఎకరాల్లో సోయా పంట సాగైనట్లు లెక్కలు చెబుతున్నాయి. కాగా 17వేల ఎకరాల్లో మొక్కజొన్న, 8200 ఎకరాల్లో జొన్నపంట, 15 వేల ఎకరాల్లో శనగపంట, 500 ఎకరాల్లో నువ్వులపంట, 200 ఎకరాల్లో గోధుమ పంట, 30 ఎకరాల్లో వేరుశనగ, 9 ఎకరాల్లో ఎర్రజొన్న పంటలు సాగవుతున్నట్లు పంటల నమోదు సర్వే వెల్లడిస్తోంది. అయితే మిగతా భూముల్లో సాగవుతున్న పంటల వివరాల సేకరణ ఆలస్యమయ్యే అవకాశాలున్నాయని అంటున్నారు. రైతు భరోసా నిధులకు సంబందించి ఈ సర్వే ప్రక్రియ కూడా కొంత మేరకు ప్రతికూలం కానుందని చెబుతున్నారు.

రైతు భరోసా నిధులపైనే సందిగ్ధత

కాగా జిల్లాలో మొత్తం 1.91లక్షల మంది రైతులు న్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు. వీరందరికి వారి భూముల విస్తీర్ణం ప్రకారం రైతు భరోసా కోసం 250 కోట్ల రూపాయలు అవసరమవుతాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు. సాంకేతిక కారణాలతో పాటు సర్వేలోని లోపాల కారణంగా ఇప్పటి వరకు కేవలం 75,101 మంది రైతులకు మాత్రమే రైతుభరోసా డబ్బులు వారి ఖాతాల్లో జమైనట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటి వరకు వీరికి 51.73 కోట్ల డబ్బులు జమ కాగా మిగతా వారికి మరో రూ. 200 కోట్లు రైతు భరోసా కోసం అవసరం కానున్నట్లు పేర్కొంటున్నారు. మిగతా రైతు భరోసా డబ్బులు జమ కానీ రైతులు ఈ వ్యవహారంపై ఆందోళనకు గురవుతున్నారు. ఎప్పటిలోగా రైతుభరోసా డబ్బులు తమ ఖాతాల్లో జమఅవుతాయంటూ అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు.

పెరిగిన పంటల సాగు

రబీ సీజన్‌లో గతం కన్నా ఈ సారి పంటలసాగు పెరిగినట్లు అధికారుల లెక్కలు వెల్లడవుతున్నాయి. 2.84.736లక్షల ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలను సాగుచేసినట్లు వ్యవసాయాధికారులు వెల్లడిస్తున్నారు. ఖరీఫ్ మాదిరిగా రబీలో కూడా వరిపంటకే రైతులు అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. ఈ సారి వరి పంట 1.05.987 లక్షల ఎకరాల్లో సాగు కాగా దాని తరువాతి స్థానంలో మొక్కజొన్నపంట నిలుస్తోంది. 1.02.591 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారు. 55.704 ఎకరాల్లో శనగ పంటను రైతులు సాగు చేస్తుండడం గమనార్హం. ఏళ్ల నుంచి రైతులు సంప్రదాయ పంటలను పక్కన పెట్టి ఆరుతడి పంటలకు ప్రాధాన్యతనివ్వాలని కోరుతున్నప్పటికీ రైతులు మాత్రం వరి, మొక్కజొన్న పంటలకే ప్రాధాన్యతనిస్తున్నారు. దీని కారణంగా పంటల కొనుగోలు, గిట్టుబాటు ధర విషయంలో ప్రభుత్వం సైతం ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోందని అంటున్నారు.



ఇప్పటి వరకు రైతు భరోసా జమ కాలేదు

● నూతికాడి వడ్డి రాజారెడ్డి, రైతు, మునిపెల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దాటిపోతోంది. కాని ఇప్పటి వరకు రైతు భరోసా డబ్బులు జమ కాలేదు. రెండు లక్షల రైతు రుణాలు కూడా చాలా మందికి మాఫీ కాలేదు. గత ప్రభుత్వంలో సరియైన సమయానికి బ్యాంకుల్లో రైతు భరోసా డబ్బులు జమయ్యి టింగ్ టింగ్‌మని మేసేజ్‌లు వచ్చేవి. ప్రస్తుతం కండ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నప్పటికి డబ్బులు జమ కావడం లేదు.

రైతు భరోసా డబ్బులు జమ కావడం లేదు..

● కాల్వ నాగన్న, రైతు, చించోలి (యం)

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతు భరోసా డబ్బులు బ్యాంకులో జమ కావడం లేదు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి రైతుల అకౌంట్‌లో రూ. 6వేలు జమ చేస్తామని రైతులకు హమీనిచ్చి ఇప్పటి వరకు రైతు భరోసా డబ్బులు జమ చేయడం లేదు. దీంతో విత్తనాలు వేసే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇకనైనా పాలకులు, సంబందిత అధికారులు రైతులను దృష్టిలో ఉంచుకొని రైతు భరోసా డబ్బులను రైతు బ్యాంకు అకౌంట్‌లో జమ చేయాలని కోరుతున్నాం.



రైతు భరోసా నాకు ఇంకా రాలే...

● వజంతాబాయి, రైతు, కదిలి

నాకు ఒక ఎకరన్నర భూమి ఉంది. అందులో పత్తి సాగు చేశాను. మూడు ఎకరాల దాక రైతు భరోసా వేశామంటున్నారు. మరీ నాకు ఎకరన్నర భూమి ఉండే మరీ నాకు ఎంటికి రాలేదో తెలుస్తలేదు.

మల్లన్నస్వామిని దర్శించుకున్న జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముజ్గి గ్రామంలో జరుగుతున్న మల్లన్న జాతరలో మల్లన్న స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్లూరి మల్లారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు చేసి అన్నదాన కార్యక్రమం పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి, పార్టీ మండల అధ్యక్షులు గంగాధర్, మాజీ రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు పొలాస మల్లేష్, మాజీ ఎంపీటీసీ సభ్యులు బి. సంతోష్, తదితరులు పాల్గొన్నారు. ముజ్గి జాతరలో గండి రామన్న ఆలయ కమిటీ చైర్మన్ భూరాజ్ గురువారం రోజు దర్శించుకున్నట్లు తెలిపారు. వీరి వెంట గుమ్ముల రవి, బద్దం లింగారెడ్డి, గొట్టి శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పెన్షనర్లకు ఉచిత కంటి పరీక్షలు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు శుక్రవారం ఉదయం 10:30 గంటలకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు ఎంసీ లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. గ్లోబల్ కంటి ఆసుపత్రి హైదరాబాద్ వారు నిర్వహించే శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

జాతీయ ఉపకార వేతనానికి విద్యార్థుల ఎంపిక

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతికి చెందిన 9 మంది విద్యార్థిని విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్)కు ఎంపికైనట్లు పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం పురుషోత్తం తెలిపారు. ఎంపికైన వారిలో కాల్వ రిత్విక్ తేజ, బి.ఆదిత్య, వినయ్‌కుమార్, మధుప్రియ, జాదవ్ వెన్నెల, మేకల ఆదేశ్‌కుమార్, వినోద్, బి. వంశీ, బి. వరుణ్, సాయి ఉన్నారు. వీరికి నాలుగు సంవత్సరాల పాటు రూ. 12 వేల చొప్పున ఉపకార వేతనం అందనుంది. వీరిని ఇన్‌చార్జి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు అభినందించారు.

మహిళపై కత్తితో దాడి

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన ఒక వ్యక్తి పాత కక్షలను మనసులో పెట్టుకొని గురువారం మధ్యాహ్నం మహిళపై దాడి చేశాడు. గడ్డం ఎల్లన్న అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన గడ్డం దేవకి ఇంటికి వచ్చి కత్తితో ఆమె కడుపులో పొడిచాడు. ఆమెకు గాయమైంది. ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి భర్త గడ్డం పోశెట్టి నర్సాపూర్(జి) పోలీసుస్టేషన్ ఫిర్యాదు చేశాడు. ఎస్సై సాయికిరణ్ ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య

సోన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంజాల్ గ్రామానికి చెందిన పి. లింగయ్య(42) అనే వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే లింగయ్య గత కొన్ని సంవత్సరాల నుంచి మద్యానికి బానిసై తాగుతూ ఎలాంటి పని చేయకుండా ఉండేవాడన్నారు. బుధవారం రాత్రి తన భార్య పిల్లలలతో అన్నం తిని మద్యం మత్తులో ఇంట్లో పడుకోను బయట రేకుల షెడ్డు పడుకుంటానని చెప్పాడు. రాత్రి రేకుల షెడ్డుకు గల ఇనుప రాడుకు నైలాన్ తాడుతో ఉరి వేసుకొని చనిపోయాడని, అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కే. గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాడు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.


ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా అడవి నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మోహన్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మహేందర్ తెలిపారు. మండలంలోని మేడిపల్లి గ్రామం నుంచి నిర్మల్ పట్టణానికి గురువారం ఇసుకను తరలిస్తుండగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ట్రాక్టర్‌ను ఆపి ఇసుక తరలింపు అనుమతి పత్రం చూపించాలని అడిగారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండటంతో పట్టుకొని నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వృద్ధురాలిని కాపాడిన పోలీసులు



నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ముజ్గిమల్లన్న జాతరలో వృద్ధురాలు కింద పడిపోగా వెంటనే స్పందించి సీపీఆర్ చేసి కాపాడినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. గురువారం కౌట్ల(కె) గ్రామానికి చెందిన గంగు అనే వృద్ధురాలు స్పృహ తప్పి కింద పడి కోమాలోకి వెళ్లిన ఆమెను వెంటనే పోలీసులు స్పందించి సీపీఆర్ చేసి బ్రతికించారు.

పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశానికి హాజరైన అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ, ఆర్వో, ఏఆర్‌వోల విధులు తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. రిటర్నింగ్ అధికారులకు మాస్టర్ ట్రైనర్లు ఎన్నికల నిర్వహణ, విధుల నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... రానున్న పంచాయతీ ఎన్నికల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం మొదలుకొని, ఎన్నికల లెక్కింపు వరకు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల విధుల నిర్వహణలో అన్ని రకాల ఫారాలను జాగ్రత్తగా పూరించాలన్నారు. రోజు వారీగా అన్ని నామినేషన్ల వివరాలను గ్రామ పంచాయతీ కార్యాలయ నోటీస్ బోర్డునందు అందుబాటులో ఉంచాలన్నారు. నామినేషన్ల పరిశీలన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, అనవసరమైన నామినేషన్లు తొలగించాలన్నారు. ఒక వ్యక్తి గరిష్ఠంగానాలుగు సెట్ల నామినేషన్లను దాఖలు చేయవచ్చునన్నారు. నామినేషన్ల చివరి రోజు నాటికి ఏదేని ఒక నామినేషన్‌కు మాత్రమే కట్టుబడి ఉండాలన్నారు. ఒకవేళ నామినేషన్లు తిరస్కరణకు గురైతే సదరు వ్యక్తికి తిరస్కరణపై అప్పీలు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించాలన్నారు.

ఎన్నికలకు 44 గంటల ముందు నుంచి ప్రచారానికిఅనుమతి ఉండదన్నారు. ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్స్ తనిఖీ, సీల్ వేయుట, తదితర ప్రక్రియలను పూర్తి చేయాలన్నారు. ఓటర్లు తమ వెంట ప్రభుత్వంచే గుర్తించబడిన ఏదేని ఒక గుర్తింపు కార్డును తీసుకు రావాలని, గుర్తింపు కార్డు చివరి 4 అంకెలు సంబంధిత ఫారంలో నమోదు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో చెల్లుబాటు కానీ ఓట్ల గుర్తింపు ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పని చేసి పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్‌అహ్మద్, కిషోర్‌కుమార్, డీపీవో శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్లు, రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్ ప్రాముఖ్యత పెంచండి

● ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విజిబుల్ పోలీసింగ్ ప్రాముఖ్యత పెరిగేలా చూడాలని ఎస్పీ జానకీషర్మిల అధికారులను ఆదేశించారు. గురువారం నెలవారీ సమీక్షా సమావేశం పలు ఆదేశాలు జారీ చేశారు. కోర్టు డేటా, మెరుగైన సేవల కోసం కంప్యూటర్లు, వెబ కామెరాలు అందించారు. స్థానిక ప్రజలతో మంచి సంబంధాలు కలిగి ఉండాలని సూచించారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. తమ పరిధిలో యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేసుకోవాలని ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. వారి కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సత్ప్రవర్తన గల వారిపై షీట్లను పరిశీలించి తీసివేయాలన్నారు. శాస్త్రీయ పద్ధతిలో విచారణ జరుపాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గంజాయి, అక్రమర రవాణా నియంత్రణపై దృష్టి సారించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా చూడాలని, హాట్ స్పాట్లు గుర్తించాలన్నారు. ఇసుక రవాణా, పీడీఎస్ బియ్యం, తదితర నియంత్రణపై దిశానిర్దేశం చేశారు. అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, రాజేష్ మీనా, అవినాష్ కుమార్, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు హాజరయ్యారు.



సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ జానకి షర్మిల

మొక్కజొన్న పంటను ధ్వంసం చేసిన అడవి పందులు



కుంటాల, ఫిబ్రవరి, 13 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాలకు చెందిన ముత్యం అనే రైతు మొక్కజొన్న పంటను బుధవారం రాత్రి అడవిపందులు ధ్వంసం చేశాయి. రాత్రి వేళలో రైతు ఇంటికి వచ్చిన సమయంలో మందలు మందలుగా వచ్చిన అడవి పందులు మొక్కజొన్న పంటను తిని నేలమట్టం చేశాయి. నాలుగెకరాల్లో మొక్కజొన్న వేయగా దాదాపు ఎకరం మొక్కజొన్న పంటను పూర్తిగా నేలమట్టం చేయడంతో రైతుకు దాదాపు 50 వేల రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

శనగ పంట దగ్ధం.. రెండు లక్షల నష్టం



కుబీర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన ఆకం భోజన్న అనే రైతుకు సంబంధించిన శనగపంట బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు దగ్ధమైనట్లు రైతు తెలిపాడు. వ్యవసాయన్నే నమ్ముకుని తనకున్న రెండెకరాలతో పాటు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకొని, నాలుగు ఎకరాల్లో శనగపంట వేశాడు. గత ఐదు రోజుల క్రితం శనగపంటను కోసి కుప్ప వేసి ఇంటికి వెళ్లాడు. కాగా రాత్రి 10 గంటల సమయంలో ప్రమాదవశాత్తు మంటలంటుకొని పూర్తిగా కాలి భూడిదైందని తెలిపారు. సుమారు రెండు లక్షల వరకు నష్టం జరిగిందని రైతు కన్నీరు పెడుతున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు, తహసీల్దార్ కార్యాలయ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

ముగిసిన డ్రోన్ టెక్నాలజీ వర్క్‌షాప్



వర్క్‌షాప్ చివరి రోజు కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోవర్దన్, పరిపాలన అధికారి రణధీర్, తదితరులు

బాసర, ఫిబ్రవరి, 13 : (ఆంధ్రజ్యోతి) : ఆర్జీయూకేటీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం, టీహన్ ఐఐటి సహకారంతో, డ్రోన్స్ డిజైన్ అండ్ ప్లే అనే అంశంపై ఐదు రోజుల వర్క్‌షాప్ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ శిక్షణ పొందిన 200ల మంది విద్యార్థులు, అధ్యాపకులకు అభినందించారు. డ్రోన్ అసెంబ్లీ డిజైన్, కాలిబ్రేషన్, సిమ్యులేషన్, ఫ్లయింగ్‌లో ఆచరణాత్మక అనుభవాన్ని పొందడం గొప్ప విశేషమని తెలిపారు. భవిష్యత్ ప్రాజెక్టులను టీహన్, ఐఐటీ హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ డిజైన్ అండ్ మ్యాను ఫ్యాక్చరింగ్ కర్నూలుతో భాగస్వామ్యాలను నెలకొల్పేందుకు తగిన ప్రణాళికను రచించాలని కన్వీనర్ డాక్టర్ నామిని రాకేషను సూచించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ ప్రొఫెసర్ మురళిదర్శన్, ఏవో రణధీర్, కోఆర్డినేటర్ డాక్టర్ నామని రాకేష్, హెచ్‌వోడీ బావ్‌సింగ్, లక్ష్మణ్ ముత్యం, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న ఇసుకకు వేలం పాట



ఇసుక వేలం పాట నిర్వహిస్తున్న తహసీల్దార్

ముథోల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని సాయి మాధవ్‌నగర్‌లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను బుధవారం రెవెన్యూ సిబ్బంది స్వాధీనం చేసుకున్న విషయం విధితమే. అయితే ఆ ఇసుకకు గురువారం తహసీల్దార్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో ఐదుగురు వ్యక్తులు పాల్గొనగా ముథోల్‌కు చెందిన ఎండీ అబిద్‌హుస్సేన్ రూ.24,900లకు దక్కించుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నారాయణ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌ను హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నేతలు గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాలో మెగాటెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయాలని ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మ కంటి రమేష్, అలిశెట్టి నాగన్న, మోర ఆశన్న, బూర్ల శంకరయ్య ఉన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన కోదండ రామాలయం

● విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవ గోడప్రతుల విడుదల

ఆదిలాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రామాయి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండరామాలయం నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధమైంది. ఇందులో భాగంగానే వచ్చేనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు విశిష్ట పూజాకార్యక్రమాల నడుమ ఆలయ ప్రారంభోత్సవ మహోత్సవాన్ని జరుపనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. గురువారం ప్రారంభోత్సవానికి సంబంధించిన గోడప్రతులను విడుదల చేశారు. వేదపండితులు బ్రహ్మశ్రీ ఫణతుల మేఘరాజ్ శర్మ ఆచార్యత్వంలో జరుపనున్న మందిర ప్రారంభోత్సవాన్ని భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వేడుకలను విజయవంతం చేయాలన్నారు.

మైసమ్మ గల్లీ రోడ్డుకు మరమ్మతులు

బోథ్, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మైసమ్మ గల్లీలో గుంతలు పడిన సీసీ రోడ్డు మరమ్మతులు చేయాలని బూత్ డెవలప్‌మెంట్ గ్రూపులో కొంత మంది వాట్సప్ మేసేజ్ పెట్టడంతో సామాజిక సేవకుడు సహకార సంఘం డైరెక్టర్ నట్ల ఉమేష్ స్పందించారు. వెంటనే తన సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు సురేష్‌వైద్య మాటాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు సీహెచ్‌రాఘవులు భూసరం భోజన్న, పాలిక్ రమేష్, అంజనరాము, తూము, భాస్కర్, శేఖర్, రాములు, శంకర్, వారి సాయికిరణ్, ఆకాశ్ పాల్గొన్నారు.

అండగా ఉంటా.. అభివృద్ధి చేస్తా : ఆడే

బోథ్, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): గ్రామ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని బూత్‌నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ పేర్కొన్నారు. గురువారం సోనాల మండలంలోని కోటకే గ్రామస్థులతో చర్చించారు. అనంతరం సోనాల గ్రామస్థుల విన్నపం మేరకు రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద మంచి నీటి కోసం బోరుబావి మంజూరు చేస్తామని ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వకార్యాలయాల్లో ఉద్యోగులు పడుతున్న ఇబ్బందుల సమస్యలను పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పోశెట్టి, గాజుల పోతన్న, బీఆర్ఎస్ నాయకులు చిలుకూరి నరేందర్ మునేశ్వర్, సోమన్న, గంగారెడ్డి, కోట గ్రామానికి చెందిన బాలాజి పవన్‌లున్నారు.

తీగలాగితే.. డొంక కదులుతోంది!

(5వ పేజీ తరువాయి)

అడ్డగోలుగా టీఆర్‌ల జారీ

సీసీఐ పత్తి కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం టీఆర్ పత్రాల జారీకి అనుమతించింది. దీంతో కౌలు రైతులు, పార్ట్ బీ, ఆర్ఓఎఫ్ఆర్, ఏజెన్సీలో గిరిజనేతరులు, కోర్టు కేసులు ఉన్న భూముల్లో పండించిన పత్తిని సీసీఐకి అమ్ముకునే విధంగా అవకాశం కల్పించారు. కానీ దీనినే ఆసరగా చేసుకుని కొందరు అధికారులు అవినీతి అక్రమాలకు తెరలేపారు.

ఇచ్చోడ మండల కేంద్రంగానే నకిలీ పత్రాల దందా

ఇచ్చోడ మండల కేంద్రంగానే నకిలీ పత్రాల దందా సాగినట్లు తెలుస్తోంది. క్షేత్ర స్థాయిలో ఫీల్డ్ వెరిఫికేషన్ చేయకుండానే అడ్డగోలుగా టీఆర్ పత్రాలను జారీ చేసి అందినకాడికి జేబులో వేసుకున్నారు. అసలు నిబంధనల ప్రకారం గ్రామస్థాయిలో ఏఈఓలు పంటలను పరిశీలించిన తర్వాతనే టీఆర్ పత్రాలను జారీ చేయాల్సి ఉంది. కానీ ఇచ్చోడ మండల స్థాయి అధికారి నిబంధనలకు విరుద్ధంగా టీఆర్ పత్రాలను జారీ చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో కోట్ల రూపాయలు చేతులు మారాయన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటి వరకు వేలల్లో నకిలీ టీఆర్ పత్రాలను ధ్రువీకరించి జారీ చేసినట్లు స్పష్టమవుతోంది.

చక్రం తిప్పిన దళారులు

రైతుల నుంచి విడివిడిగా పత్తిని సేకరించిన దళారులు అదే పత్తిని మళ్లీ సీసీఐకి విక్రయించేందుకు అధికారుల వద్ద చక్రం తిప్పుతున్నారు. బినామీ రైతుల పేరిట టీఆర్ పత్రాలను తీసుకుని సీసీఐకి పత్తిని విక్రయిస్తున్నారు. ఒక్కో క్వింటాల్‌కు రూ.300ల నుంచి రూ.500లను చెల్లించి నకిలీ ధ్రువీకరణ పత్రాలను తీసుకుంటున్నారు. తలో కొంత కమీషన్‌లు రావడంతో అధికారులు కూడా తలొగ్గుతున్నారు. వ్యవసాయ శాఖ, మార్కెటింగ్, రెవెన్యూ శాఖల అధికారులు అవినీతికి పాల్పడుతూ పత్తి దళారులకు అండగా నిలుస్తున్నారు. దీంతో సీసీఐ అధికారులు అవేమి పరిశీలించకుండానే ఆన్‌లైన్ నమోదు ప్రకారం పత్తిని కొనుగోలు చేస్తూ బినామీ రైతుల ఖాతాల్లో పంట డబ్బులను జమ చేస్తోంది. ఆ తర్వాత రైతులకు కూడా కొంత కమీషన్ రూపంలో ముట్టచెప్పి లాభాలను జేబులో వేసుకుంటున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా చూసీ చూడనట్లుగానే వ్యవహరిస్తున్నారు.

బడా వ్యాపారులే కౌలు రైతులు

ఇచ్చోడ మండల కేంద్రంలో వ్యాపారాలు చేస్తున్న కొందరు బడా వ్యాపారులు కౌలు రైతుల అవతారం ఎత్తి అక్రమ దందాలకు పాల్పడుతున్నారు. వాస్తవానికి ఎలాంటి ఆధారం లేని రైతులకు మాత్రమే టీఆర్ ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాల్సి ఉంటుంది. కానీ అధికారులు అడ్డగోలుగా ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తూ చిత్ర విచిత్రాలకు తెరలేపుతున్నారు. ఇచ్చోడ మండల కేంద్రంలో ఓ ఫర్టిలైజర్ షాపు యజమాని మండలంలోని దాబా(కె) గ్రామానికి చెందిన రాథోడ్ సీతాబాయి, బిక్కుబాయి అనే రైతుల భూమిని కౌలుకు తీసుకుని పత్తిపంటను సాగు చేస్తున్నట్లు ధ్రువీకరించడంపై విమర్శలు వస్తున్నాయి. అలాగే ఇచ్చోడ రెవెన్యూ అధికారి సిరికొండ మండలానికి చెందిన కౌలు రైతును ధ్రువీకరించడం ఏమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. భూ యజమాని మరణించిన తర్వాత కూడా ఆయన పేరిటా ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తున్నారు. ఇలా అధికారులకు ఎంతో కొంత ముట్టచెప్పి వ్యాపారులు, దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

చోరీ జరిగిన ఇంటిని పరిశీలించిన ఎమ్మెల్యే



సోనాలలో చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బోథ్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలోని వ్యాపారి ఇంట్లో చోరీ జరిగిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా దోపిడీ జరిగిన తీరును ఇంటి యజమానిని అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి దూరంగా ఉన్న ఇండ్ల వారు తగుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులున్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు

బోథ్ మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన జనార్ధన్‌రెడ్డి మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్యే జాదవ్‌అనిల్ కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాసులు పరామర్శించారు.

'గులాబీ జెండా ఎగురవేద్దాం'



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నియోజక వర్గ ఇన్‌చార్జీ జాన్సన్‌నాయక్

ఉట్నూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ నుంచి, మండల పరిషత్, జిల్లా పరిషత్ కార్యాలయం వరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేద్దాం అని పార్టీ శ్రేణులు క్రమశిక్షణతో పనిచేయాలని ఖానాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ అన్నారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉట్నూర్ మండలంలో ఆశించిన మెజార్టీ రాకపోవడం వల్లనే ఓటమికి గురయ్యామన్నారు. భయంతోనే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయాన్ని పొడగించిందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ రాథోడ్‌జనార్దన్, మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, మాజీ జడ్పీటీసీ చారులత రాథోడ్, నాయకులు కొమ్ము విజయ్, సలీముద్దీన్, పెందూరు ప్రభాకర్, కాటం రమేష్, సిడాం సోనేరావు, కే.రాజు పాల్గొన్నారు.

ప్రజావాణిలో సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ

బోథ్, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులు సబ్సిడీ గ్యాస్, రుణమాఫీ, విద్యుత్ బిల్లులు వంటివి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మండల ప్రత్యేక అధికారి వాజిద్ అలీ, ఎంపీడీవో రమేష్, డిప్యూటీ తహసీల్దార్ సూరజ్ రావులు పరిశీలించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఫిర్యాదులు 160 మంది మాత్రమే చేయడం జరిగిందని అధికారులు తెలిపారు.

ఘనంగా ఆంగ్ల భాషాదినోత్సవం

ఉట్నూర్, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఆంగ్లభాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సరోజనినాయుడు జన్మదినాన్ని ఆంగ్లభాష దినోత్సవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు సరోజిని నాయుడు గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఆంగ్ల భాష అధ్యాపకులు దశరథ్ సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జీ ప్రిన్సిపల్ శ్రీనివాస్, అధ్యాపకులు సువర్ణ, గణేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ చేరాల లక్ష్మణ్, సుజాత, నవీన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఇచ్చోడ, ఫిబ్రవరి, 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన ఇచ్చోడ మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. సిరికొండ మండలం లచ్చింపూర్ (బీ) గ్రామానికి చెందిన యువతితో పాటు మరోవ్యక్తి ద్విచక్రవాహనంపై ఇచ్చోడకు వస్తుండగా నిర్మల్‌వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఒకదానికొకటి ఢీకొనగా ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. వెంటనే వీరిని పీహెచ్‌సీకి తరలించారు.

హిరాసుక ఉత్సవాలను విజయవంతం చేయండి

ఇచ్చోడ, ఫిబ్రవరి, 13 (ఆంధ్రజ్యోతి) : ఇచ్చోడలో పర్దాన్ పురోహిత్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 25న ఇచ్చోడలో నిర్వహించే హిరాసుక ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్, నాయ కులు బలిరాం, మధుకర్, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

ఆదిలాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బంగారుగూడలో 17 లీటర్ల రూ.14368 విలువ చేసే అక్రమ మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఈ మేరకు పురుషోత్తం అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పత్తి కొనుగోళ్లలో అవినీతి జరగడం దారుణం

● మాజీ మంత్రి జోగురామన్న

ఆదిలాబాద్, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి):గతంలో ఎన్నడు లేని విధంగా సీసీఐ పత్తి కొనుగోళ్లలో అవినీతి జరుగడం దారుణమని ఈ విషయం పై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర విచారణ జరపాలని మాజీ మంత్రి జోగురామన్న డిమాండ్ చేశారు. గురువారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో దాదాపు 25లక్షల క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేసిందన్నారు. కొనుగోళ్లలో భారీగా అవినీతి జరగడం, మార్కెట్ సెక్రటరిని సస్పెండ్ చేసే పరిస్థితికి కారణమేంటని ప్రశ్నించారు. కొనుగోళ్ల విషయంలో కనీస శ్రద్ధ చూపలేదని, అధికారులతో కనీసం సమీక్ష సమావేశాన్ని సైతం నిర్వహించ లేదన్నారు. గత పదేళ్లలో ఇంత కంటే భారీ ఎత్తున కొనుగోళ్లు జరిగిన ఎటువంటి అవినీతి ఆరోపణలు రాలేదని గుర్తుచేశారు. ఇజ్జగిరినారాయణ, మెట్టు ప్రహ్లాద్, మారిశెట్టి గోవర్ధన్, దమ్మపాల్, కొండ గణేష్, బట్టుసతీస్, అప్కామ్ గంగయ్య, దాసరి రమేష్, బుట్టి శివకుమార్, దేవిదాస్, అడప తిరుపతి, నవతే శ్రీనివాస్, ఉగ్గే విటల్,కలీమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులపై బహిరంగ విచారణ



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భీంపూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పథకాలు ఒక్కటి కూడా అమలైన దాఖలాలు లేవని బీఆర్ఎస్ నాయకులు గురువారం భీంపూర్‌లోని రైతు వేదికలో నిర్వహించిన ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం బహిరంగ విచారణ వేదిక కార్యక్రమంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజావాణిలో గతంలో మొత్తం 57 మంది దరఖాస్తు చేసుకోగా 31 మంది హాజర య్యారు. అందులో 24 పరిష్కారం అయినట్లు మండల ప్రత్యేక అధికారి కిషన్, ఎంపీడీవో గోపాల క్రిష్ణ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నలంద ప్రియా, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ చంద్రశేఖర్, విద్యుత్‌శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, సూపరింటెండెంట్ జంగు, ఎంపీవో సుమీర్ అహ్మద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలి'

కుభీర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు ఆరోగ్య సూత్రాలు పాటించేలా అవగాహన కల్పించాలని ఏపీఎం రమేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మండల వీవోలు, సీఏలకు, ఎఫ్ఎన్‌హెచ్‌డబ్ల్యూ కార్యక్రమాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫుడ్ న్యూట్రీషన్ హెల్త్‌వాష్ కార్యక్రమాలను గ్రామీణ ప్రాంత డ్వాక్రా మహిళ గ్రూప్ సంఘాలకు అవగాహన కల్పించారు. వీవో, సీఏలకు సూచించారు. మహిళ సంఘాల బలోపేతానికి కృషి చేయాలన్నారు. రుణాలు పొందిన డ్వాక్ర మహిళ సంఘాల నుంచి ప్రతి నెల క్రమం తప్పకుండ వాయిదాలు చెల్లించేలా చూడాలన్నారు. గ్రామాల్లో నూతన డ్వాక్రా గ్రూపుల ఏర్పాటు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు దత్తాత్రి, సరస్వతీ, భూమన్న, శ్రీనివాస్, అమూల్, వీవో అధ్యక్షులు, సీఏలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సరోజిని నాయుడు జయంతి

కుంటాల, ఫిబ్రవరి, 13 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల స్థానిక ఆదర్శ మాడల్ పాఠశాలలో గురువారం సరోజిని నాయుడు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పని చేస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయుడు నవీన్ గౌడ్, సంగీత, గంగయ్యల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆంగ్లం యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. విద్యార్థుల చేత వివిధ రకాల నమునాలను తయారు చేయించి ఆంగ్లం సులువుగా నేర్చుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఉమేష్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి అల్లోల

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామానికి చెందిన తాజ మాజీ సర్పంచ్ ఉల్వాజి చంద్రవ్వ(68) ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలిసిన మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి గురువారం బాధిత బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, నాయకులు అల్లోల సురేందర్‌రెడ్డి, ఎఫ్ఏసీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, నాళం శ్రీనివాస్, పడిగెల గంగాధర్, మహిపాల్ రెడ్డి, గంగారాం, చిన్నారెడ్డి, భూమేష్, సాయన్న వెంట ఉన్నారు.

నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్ గురువారం ఉల్వాజి రాజును పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీజడ్పీటీసీ ఓస రాజేశ్వర్, నాయకులు భూమన్న, సిరాజుద్దీన్, రాజు, పోశెట్టి, తదితరులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సమావేశం

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధ కార్యక్రమంలో భాగంగా ఆయా రాజకీయ పార్టీ నాయకులతో ఎంపీడీవో రాధా రాథోడ్ గురువారం సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాలు, ఇతర పరిస్థితి పరిస్థితుల గుర్తించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అమీర్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ తరఫున నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ తరఫున కొరిపెల్లి కృష్ణారెడ్డి, బీజేపీ పార్టీ తరఫున గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్

కుంటాల, ఫిబ్రవరి, 13 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల స్థానిక ఆదర్శమాడల్ పాఠశాలలో వసతి గృహాన్ని గురువారం తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్ తనిఖీ చేశారు. వసతి గృహంలో విద్యార్థుల వివరాల రిజిస్టరు పరిశీలించారు. భోజనం పరిశీలించారు. నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలని సూచించారు. ప్రభుత్వ మెనూను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల కల్పిస్తున్న సౌకర్యాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా కృషిచేయాలి

● ముధోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్

భైంసా, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికబద్ధమైన విధానాలు, పకడ్బందీ చర్యలతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా బీజేపీ శ్రేణులు పాటుపడాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పిలుపునిచ్చారు. గురువారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ముథోల్ నియోజక వర్గ పరిధిలోని పార్టీ బాధ్యులు, ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జీలు, ప్రధాన కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రేవంత్ రెడ్డి సర్కార్ అనుసరిస్తున్న విధానాలతో కాంగ్రెస్ పార్టీపై అన్ని వర్గాలు అసంతృప్తితోనున్నాయన్నారు. హమీల అమలులో కాంగ్రెస్ సర్కార్ వైఫల్యం చెందడం అన్ని వర్గాలు బీజేపీ వైపు దృష్టి సారించాయని వివరించారు.ఇక బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉంటోందన్నారు. ఇలాంటి అనుకూల పరిస్థితులను పార్టీ శ్రేణులను సద్వినియోగం చేసుకొని ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం గాను కార్యోన్ముఖుల వ్వాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ముథోల్ నియోజక వర్గ ఇన్‌చార్జీ హరినాయక్ మాట్లాడుతూ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం బీజేపీ శ్రేణులు బాధ్యతాయుతమైన విధానాల ద్వారా అంకితభావంతో వ్యవహరించాలన్నారు. కాంగ్రెస్ పట్ల ప్రజల్లో వ్యతిరేకత నెలకొని ఉన్న నేపథ్యాన్ని సద్వినియోగం చేసుకొని పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం మార్గం సుగమం చేయాలని పిలుపునిచ్చారు. వ్యూహ, ప్రతి వ్యూహాలతో ఎన్నికల సమరానికి సన్నద్ధమవ్వాలని సూచించారు. ఇందులో భైంసా పట్టణ, మండల పార్టీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్, సిరం సుష్మారెడ్డిలతో పాటు నియోజక వర్గ పరిధిలోని ఆయా ప్రాంతాల, మండలాల పార్టీ కార్యవర్గ ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రధాన కార్యకర్తలు, ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జీలు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి



కథలాపూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలంలోని పోసానిపేటలో నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన జక్కుల సాయికుమార్ (35) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం పోసానిపేటకు చెందిన ఓ మహిళతో సాయికుమార్‌కు కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. వారం రోజుల కిందట అత్తగారింటికి ఓ శుభకార్యం కోసం సాయికుమార్ వచ్చాడు. గత ఆదివారం ఖానాపూర్ వెళ్తున్నానని చెప్పి అత్తగారింటి నుంచి వెళ్లాడు. అక్కడికి చేరుకోకపోవడంతో బంధువులు, కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియలేదు. గురువారం గ్రామ సమీపంలోని ఓ బావిలో శవమై అనుమానాస్పదంగా కనిపించాడు. సాయికుమార్ ఆన్‌లైన్ బెట్టింగ్ లో సొమ్ము పోగొట్టుకుని అప్పులు చేసినట్టు తెలిసింది. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వరి పొలాన్ని పరిశీలించిన శాస్త్రవేత్తలు

అగ్గి తెగుళ్లు, కాండం తొలుచు పురుగు ఉధృతి గుర్తింపు

ముథోల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చించాల గ్రామ శివారులో గల వరి పొలాలను గురువారం ముథోల్ వ్యవసాయ పరిశోధన, ఏరువాక శాస్త్రవేత్తలు డా. విజయ్‌కుమార్, డా. కార్తీక్‌లు పరిశీలించారు. వరి పంటలో అగ్గి తెగుళ్లు, కాండం తొలుపు పురుగు ఉధృతి ఉన్నట్లు గుర్తించారు. కాండం తొలుచు పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లేదా క్లోరంట్రానిలిప్రోల్ 3 ఎంఎల్ లీటరు నీటికి కలిపించి పిచికారీ చేయాలని తెలిపారు. అగ్గి తెగుళ్ల నివారణకు టేబుకొనజోల్, ట్రైఫ్లో ఆక్సిస్ట్రోబిన్ 0.4 గ్రాములు లేదా ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.



వరి పంటను పరిశీలిస్తున్న దృశ్యం

సమయానికి బస్సులు లేక ప్రయాణికుల ఇక్కట్లు



బస్సు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

కుభీర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : కుభీర్ బస్టాండ్‌లో బస్సుల కోసం గంటల తరబడి ఎదురు చూసి నిరాశకు లోనైన ప్రయాణికులు ప్రయివేటు వాహనాలను ఆశ్రయించి గమ్యం చేరుకోవాల్సిన దుస్థితి వివిధ గ్రామాల ప్రజలకు ఎదురైంది. గతవారం పది రోజులుగా బస్సులు సమయానికి రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఈ బస్టాండ్‌కు మండలంలో ఆయా గ్రామాల ప్రయాణికులు వందలాదిగా వస్తుంటారు. వారికి కావాల్సిన వసతులు లేవు. బెంచీలు సరిపోవడం లేదు. గంటల తరబడి నించొని ఉండాల్సిన పరిస్థితి నెలకొందని కనీసం తాగునీరు, మరుగుదొడ్ల వసతులు కూడా లేవని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమయపాలనతో పాటు ప్రయాణికులకు వసతులు కల్పించాలని కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో

సమస్యలుంటే తెలియజేయాలి



కడెం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : రానున్న ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల గురించి, ఏదైనా సమస్యలు ఉంటే ఈ 15 లోపు సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో అరుణ అన్నారు. రానున్న ఎన్నికల్లో భాగంగా గురువారం అన్ని రాజకీయ పార్టీలతో ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. దీనికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు హాజరై ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పొద్దు టూరి సతీష్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నల్ల జీవన్‌రెడ్డి, బీజేపీ నాయకులు గట్ల నల్లగొండ, బీఎస్పీ నాయకులు జోసెఫ్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బి. రమేష్ వర్మ, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ముడికే మల్లేష్ యాదవ్, నాయకులు బొడ్డు గంగన్న, రమేష్, యాదగిరి సత్యం, రాజన్న, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను నిల్వ ఉంచితే చర్యలు



నిల్వ ఉంచిన ఇసుకను పట్టుకున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది

సోన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు గంజాల్ గ్రామ సమీపంలో గల స్వర్ణ నదిలో నుంచి అక్రమంగా ఇసుకను బయటకు తీసుకొచ్చి నిల్వ ఉంచిన ఇసుకాసురులు గురువారం సోన్ ఎస్సై కే.గోపి, రెవెన్యూ కార్యాయల సిబ్బంది షేక్‌రఫీక్‌దాడి చేసి పట్టుకున్నట్లు వారు వివరించారు. అక్రమంగా వాగులో నుంచి ఇసుకను తరలించి నిల్వ ఉంచుతున్నారన్న సమాచారం మేరకు 12 ట్రాక్టర్ల ఇసుక డంపును స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఎవరైనా వాగులో నుంచి ఇసుకను తరలించిన, నిల్వ ఉంచిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని వారు వివరించారు.

జాతీయ ఉపకార వేతనానికి ఎంపిక



కుంటాల, ఫిబ్రవరి, 13 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓలా ఉర్దూమీడియం హైస్కూల్‌కు చెందిన సాదియా నాజ్ అనే 8వ తరగతి విద్యార్థిని జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైనట్లు హెచ్‌ఎం రాహుల్‌కుమార్ తెలిపారు. గత 2024 నవంబర్ 24న ఈ ఉపకార వేతనాల కొరకు పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఓలా పాఠశాల విద్యార్థి ఎంపికైంది. నాలుగు సంవత్సరాల పాటు ఏడాదికి రూ. 12 వేల చొప్పున ఈ ఉపకార వేతనం అందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని మాజీ సర్పంచ్ ఖనీష్ ఫాతిమా, హెచ్‌ఎంలు అభినందించి సన్మానించారు.

బాసర అమ్మవారి

హుండీ కానుకల లెక్కింపు

● 79 రోజుల్లో రూ. కోటికి పైగా ఆదాయం

బాసర, ఫిబ్రవరి, 13 (ఆంధ్రజ్యోతి): బాసర సరస్వతి అమ్మవారి హుండీ కానుకలను గురువారం ఆలయ అధికారులు లెక్కింపు చేపట్టారు. రూ. ఒక కోటి 85 వేల 110 నగదు, మిశ్రమ బంగారం 78 గ్రాములు, మిశ్రమ వెండి 4 కిలలో 800 గ్రాములతో పాటు వివిధ దేశాలకు చెందిన 36 విదేశీ కరెన్సీలు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ ఆదాయం మొత్తం 79 రోజుల్లో అమ్మవారికి సమకూరింది. ఈ లెక్కింపులో ఆలయ అధికారులు, పోలీసులు, బ్యాంకు సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మక్క సారలమ్మ జాతర

● శ్రీ సమ్మక్కకు బోనాలు, ఓడి బియ్యం సమర్పణ

● మొక్కులు తీర్చుకున్న భక్తులు



ఎడ్‌బిడ్ తండాలో సారలమ్మకు పూజలు చేస్తున్న దృశ్యం

ముథోల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ తండాలో గల గుట్టలో వెలసిన సమ్మక్క సారలమ్మ మినీ జాతర ప్రారంభమై గురు వారానికి రెండో రోజుకు చేరుకుంది. రెండో రోజున సమ్మక్కకు బోనాలు, ఓడి బియ్యం సమర్పించారు. కోరిన కోరికలు నెరవేరాలని వన దేవతలకు భక్తులు మొక్కులు చెల్లించారు. వన దేవతలకు భక్తి శ్రద్ధలతో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మొక్కిన మొక్కులు నెర వేరాలని నిలువెత్తు బంగారాన్ని (బెల్లం) సమర్పించారు.

పాత బీరు సీసాకు కొత్త రేటు

● పెరిగిన రెట్లతో మద్యం ప్రియుల పరేషాన్

● పాత బీర్లకు నూతన ధరలతో

సొమ్ము చేసుకుంటున్న మద్యం వ్యాపారులు



పాత రేట్‌తో ఉన్న బీర్ సీసాను కొత్త రేట్‌తో విక్రయిస్తున్న దృశ్యం

ఇచ్చోడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చల్లటి బీర్ల ధరలు పెంచడంతో మద్యం ప్రియులకు షాక్ తగిలింది. ఒక్కొక్క బీర్ బాటిల్ వేనుక సుమారు 30 రూపాయలు పెరగడంతో మద్యం ప్రియులు బేజా రెత్తిపోత్తున్నారు. రానున్నది వేసవి కాలం కావడంతో సాధారణంగా బీర్లకు డిమాండ్ ఉంటుంది. సమయం చూసి రాష్ట్ర ప్రభుత్వం ధరను పెంచడం సరికాదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఇప్పటికి మద్యం దుకాణాల్లో ఉన్న పాత కింగ్ ఫిషర్ బీర్ల సీసాలపై పాత ప్రింట్‌తో ముద్రించిన ఓల్డ్ స్టాక్ రేటు ఉండగా వాటిని పెరిగిన నూతన ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు మద్యం వ్యాపారులు. ప్రభుత్వం నిర్ణయించిన మద్యం దుకాణాల్లో లైట్ బీర్ ధర 150, స్ట్రాంగ్ బీర్ ధర 160 ఉండగా.. ఓల్డ్ స్టాక్‌ను సైతం నూతన ధరలు లైట్ బీర్ 180, స్ట్రాంగ్ బీర్ 190లకు విక్రయిస్తున్నారని మద్యం ప్రియులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా.. బెల్టు దుకాణాల్లో ఏకంగా 200కు బీర్లను విక్రయిస్తుండడం గమనార్హం. ఈ విషయమై అబ్కారీ సీఐ జుల్ఫీకర్ ఆహ్మద్‌ను వివరణ కొరగా.. బీర్ సీసాలపై ముద్రించిన ధరకే విక్రయించాలని మద్యం సీసాలపై ఉన్న ప్రింట్ రెట్ కంటే ఎక్కువ రేట్ తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పంట చేనులో చిరుత కదలికలు



నిపాని శివారు పంటచేనులో చిరుత ఆనవాళ్లను అన్వేషిస్తున్న అధికారులు

భీంపూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిపాని గ్రామానికి చెందిన సర్పస్ లింగారెడ్డి అనే రైతు తన పంట చేనులో ఏర్పాటుచేసుకున్న సీసీ కెమెరాలో గురువారం ఉదయం చిరుతపులి కదలికలు రికార్డు అయ్యాయి. ఇది గమనించిన రైతు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాడు. స్పందించిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అహ్మద్ ఖాన్ తన సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని ఇది చిరుతపులి అని నిర్ధారించారు. రైతులు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని రైతులంతా ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఆయనతోపాటు బీట్ ఆఫీసర్ శ్రీనివాస్, సిబ్బంది సోనేరావ్, కృష్ణ, ఆపరేటర్ తిరుపతి ఉన్నారు.

నేడు మందపల్లి

పెద్దమ్మ తల్లి జాతర

● జాతరకు ముస్తాబైన ఆలయం

పెంబి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మందపల్లి గ్రామంలోని పెద్దమ్మ తల్లి జాతరకు ఆలయం ముస్తాబైంది. జాతర శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పెద్దమ్మ తల్లి కల్యాణ మహోత్సవం, అగ్ని గుండాలు, బలి, అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పెద్దమ్మ తల్లి ఆశీస్సులు పొందాలని కోరారు.



జాతరకు ముస్తాబైన పెద్దమ్మ తల్లి ఆలయం

మధ్యాహ్నమైతే.. ఇంటికే!

● అంతా మా ఇష్టం అంటున్న ఉపాధ్యాయులు ● ఇష్టారీతిన విధులు ● పట్టించుకోని అధికారులు ● విద్యార్థులకు అందని నాణ్యమైన విద్య

ఆంధ్రజ్యోతి పరిశీలన



ఉపాధ్యాయుడు రాక.. తాళం వేసి ఉన్న దహిగూడ పాఠశాల



టీచర్ మధ్యాహ్నమే వెళ్లి పోవడంతో.. మొలాల్ గుట్ట స్కూల్ బయట విద్యార్థులు





ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఇదేంటి ఇక్కడ పగటి పూట బడులేమైనా కొనసాగుతున్నాయా.. ఏంటి అనుకుంటున్నారా..? అలా అనుకుంటే మీరు పొరపడినట్లే.. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని టీడబ్ల్యూపీఎస్ ఏకోపాధ్యాయ పాఠశాలలో టీచర్లు అంతా మా ఇష్టం.. అన్నట్లుగా వ్యవహరిసున్నారు. దీంతో గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందక శాపంగా మారింది.. ఆదిలాబాద్ మండలంలోని మొలాల్ గుట్ట, దహిగూడ, వివిధ పాఠ శాలల్లో మధ్యాహ్నం 2 గంటలైతే చాలు.. సార్లు ఇంటి బాట పడుతున్నారని విద్యార్థుల తల్లి దండ్రులు వాపోతున్నారు. వీరిని అనే వారు లేరు, పట్టించుకునే వారు లేరని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి 9.30 నుంచి 4 గంటల వరకు ఉపాధ్యాయులు ఉండి బడి నడిపించాలి కానీ.. మధ్యాహ్న భోజనం చేశాక బడికి తాళం వేసి మాస్టార్లు ఇంటి బాట పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

సార్ రాక పోతే.. సెలవులే!

మండలంలోని వివిధ టీడబ్ల్యూపీఎస్ స్కూళ్లల్లో సారు ఏదైనా కారణం చేతనో. ఆరోగ్యం బాగా లేకనో రాక పోయినా.. ఎన్ని రోజులు ఉపాధ్యాయుడు సెలవులో ఉంటే.. అన్ని రోజులు ఆ విద్యార్థులకు సెలవే అన్నట్లుగా మారింది. దీంతో ఇక్కడి గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందక విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు..

ఉపాధ్యాయుడు వెళ్లి పోవడంతో మొలాల్ గుట్ట స్కూల్ బయట ఆడుకుంటున్న విద్యార్థులు

కొనసాగుతున్న మల్లన్న జాతర

● నేడు కుస్తీ పోటీలు, రాత్రి అగ్నిగుండ ప్రవేశం ● పెద్ద సంఖ్యలో హాజరుకానున్న భక్తులు



సత్యనారాయణ వ్రతాలు చేస్తున్న భక్తులు



నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పిస్తున్న భక్తులు

ముథోల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలోని మల్లన్న దేవుడి జాతర కొనసాగుతుంది. మూడో రోజైన గురువారం ఆయా ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సత్యనాఉరాయణ వ్రతాలను నిర్వ హించారు. శుక్రవారం కుస్తీ పోటీలు జరుగనున్నాయి. ఈ కుస్తీ పోటీలకు తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్ర నుంచిమల్లయోధులు వచ్చి పాల్గొంటారు. రాత్రికి అగ్నిగుండ ప్రవేశం నిర్వహిస్తారు. అలాగే భక్తులకు భారీ అన్నదానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ముజ్గిలో భక్తిశ్రద్ధలతో రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



చిన్నారికి తులాభారం వేస్తున్న భక్తులు

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముజ్గి గ్రామంలో గురువారం రోజు రథోత్సవం నిర్వహించారు. భక్తులు ఆలయం చుట్టూ సాంప్రదాయబద్ధంగా రథాన్ని ఊరేగించారు. స్వామి వారికి నైవేద్యం సమర్పించి పుట్టు వెంట్రుకలు సమర్పిం చుకున్నారు. వచ్చిన భక్తులకు దేవస్థానం తరఫున అన్నదాన కార్య క్రమం నిర్వహించారు. శుక్రవారం నాగవెల్లి నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. నిర్మల్ రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో బందో బస్తు నిర్వహించారు.

వన దేవతలను దర్శించుకున్న మంత్రి సీతక్కతో ఆత్రం సుగుణక్క



మేడారంలో మంత్రి సీతక్కతో కలిసి వనదేవతలకు పూజలు చేస్తున్న దృశ్యం

ఉట్నూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సమ్మక్క సారక్క దేవతలు కొలువుదీరిన ములుగు జిల్లాలోని మేడారంలో మినీ జాతర సందడి మొద లైంది. గురువారం మంత్రి సీతక్కతో కలిసి కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఆత్రం సుగుణక్క ఆదివాసీ ఆచార సాంప్రదాయల ప్రకారం నిర్వహించుకునే పూజ కార్యక్రమాల్లో పాల్గొని మొక్కులు తీర్చుకు న్నారు. మేడారం గ్రామం నుంచి గ్రామ పొ లిమెరలో ఉన్న సమ్మక్క సార క్క గద్దెల వద్దకు సాంప్రదాయ డప్పు వాయిద్యాల మధ్య బోనాలతో శోభ యాత్ర నిర్వహించగా సీతక్క సుగుణక్క పాల్గొన్నారు. నాలుగు రోజుల పాటు జరిగే మిని జాతరకు వచ్చే భక్తుల కోసం అన్ని వసతులు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రత్యేక నిధులు కేటాయించి పనులు పూర్తి చేయడం జరిగిందని మంత్రి సీతక్క తెలిపారన్నారు. ఆర్టీసీ అధికారులు హనుమకొండ జిల్లా కేంద్రం నుంచి బస్సులను మేడారం నడిపిస్తున్నారని జా తరకు వచ్చే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వరిస్తుందని తెలిపారు. భక్తులు భక్తి భావంతో పూజ కార్యక్రమాలు నిర్వ హించుకుని, క్షేమంగా ఇంటికి చేరుకోవాలని మంత్రి సూచించారు.

శిథిలమవుతున్న వంతెన

● భయాందోళనలో ప్రయాణికులు



శిథిలావస్థకు చేరిన వంతెన

కుభీర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఈ వంతెనపై రాకపోకలు సాగించాలంటే ప్రయాణికులు భయాందోలనకు గురవుతున్నారు. కుభీర్ మండల కేంద్రం నుండి పార్డి(బి), చాత, హల్దా, రంగశివుని, మర్లగొండ, విరేగాం వెల్లే రహదారి పార్డి(బి), గ్రామ శివారులో గల వాగుపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరి వాహనదారులను వణికిస్తోంది. దశాబ్ధాల క్రితం నిర్మాణం చేపట్టడంతో ఉనికి కోల్పోతుందని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఈ వంతెనకు వాహనాలు ఢీకొని రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. వాటి అడుగు భాగంలో ఇనుప చువ్వలు తేలి బయటకు కనిపిస్తున్నాయి. ఈ వంతెనపై నుంచి ప్రతి రోజు వందలాది వాహనాలు వెళ్తుంటాయి. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. కొత్త వంతెనను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ప్రజలు కోరుతున్నారు.



వస్తువులను పరిశీలిస్తున్న ఆర్కియాలజీ అసిస్టెంట్ డైరెక్టర్, ఆర్‌డీవో

ముథోల్‌లో నాణేలు దొరికిన స్థలాన్ని

పరిశీలించిన ఆర్కియాలజీ శాఖ అధికారులు

ముథోల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ముథోల్‌కు చెందిన లూటే మారుతి తన పశువుల పాక తొలగించి నూతన ఇంటి నిర్మాణం కొరకు ఇటీవల పునాది పనులు (పిల్లర్ల రంధ్రాలు) తవ్వుతుండగా ఔరంగజేబు కాలం నాటికి చెందిన 92 నాణేలు దొరికిన విషయం విదితమే. అయితే గురువారం నాణేలు దొరికిన స్థలాన్ని కరీంనగర్ నుండి ఆర్కియాలజీ శాఖ (పురావస్తు శాఖ) అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్. సాగర్, రవితేజలు పరిశీలించారు. ఆ ప్రాంతంలో దొరికిన వస్తువులు సేకరించారు. పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంబంధించిన వివరాలు జిల్లా ఉన్నతాధికారులకు వివరించనున్నట్లు తెలిపారు. వీరి వెంట ఆర్‌డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ నారాయణ పటేల్ ఉన్నారు.



ఫొటో న్యూస్







సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసిన దృశ్యం

సోలార్‌తో విద్యుత్



నిత్యం కరెంట్ బిల్లు గురించి ఆందోళన పడే అవసరం లేకుండా ఒకేసారి సోలార్ సిస్టంపై పెట్టుబడి పెట్టేందుకు జిల్లా వాసులు ఆసక్తి చూపుతున్నారు. పట్టణంలోని మహాలక్ష్మి ఆయిల్ మిల్‌లో దాదాపు 95లక్షల రూపాయల వ్యయంతో సోలార్ సిస్టంను ఏర్పాటుచేశారు. ప్రతీరోజు 1100 యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసేలా 275 కిలో వాట్ల కెపాసిటి గల సోలార్ సిస్టంను ఏర్పాటు చేయగా నెలకు దాదాపు 2లక్షల బిల్లు ఆదా అవుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. పరిశ్రమలతో పాటు గృహ వినియోగానికి సైతం సోలార్ విద్యుత్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

●(ఆంధ్రజ్యోతి ఆదిలాబాద్ స్టాఫ్‌ఫొటోగ్రాఫర్)



పదోతరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల పరిశీలన

నార్నూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల నార్నూర్ పదోతరగతి విద్యార్థులు రాసిన పరీక్ష ఇంటర్నల్ మార్కులను గురువారం టీం అబ్జర్వర్ రవిప్రసాద్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం పరిశీలన చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టెస్టులు విద్యార్థులు పెట్టడం వల్ల రాబోయేరోజుల్లో మంచి ఫలితాలు రాబట్టొచ్చని అభిప్రాయపడ్డారు. పదోతరగతి చివరి పరీక్షలకు విద్యార్థులకు ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా వారికి అర్థమయ్యేలా సలహా, సూచనలు ఇవ్వాల్సిన బాధ్యత ఉపాధ్యాయ బృందంపై ఉందన్నారు. వారి వెంట ప్రధానోపాధ్యాయులు, పీడీ తదితరులున్నారు.



ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తిని అమ్మేందుకు తరలివచ్చిన పత్తి బండ్లు

డొంక కదులుతోంది!

- వ్యవసాయ శాఖ అధికారులే అసలు సూత్రధారులు
- ఇచ్చోడ మండల కేంద్రంగా సాగిన నకిలీ పత్రాల దందా
- పరిశీలించకుండానే గుడ్డిగా టీఆర్ ధ్రువీకరణ పత్రాల జారీ
- అడ్డదారిలో పత్తిని సీసీఐకి విక్రయించిన దళారులు
- కౌలు రైతులుగా ఫర్టిలైజర్, పత్తి వ్యాపారుల పేర్లు నమోదు
- విజిలెన్స్ విచారణతో బయట పడనున్న మరిన్ని అక్రమాలు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : సీసీఐ పత్తి కొనుగోళ్లలో భారీ అక్రమాలు, అవినీతి జరిగినట్లు గుర్తించిన ప్రభుత్వం జిల్లా అధికారులపై చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి కార్యదర్శి కాంబ్లె మధుకర్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. ప్రభుత్వ చర్యలతో జిల్లా మార్కెటింగ్, వ్యవసాయశాఖలో కలకలం రేపుతోంది. ముఖ్యంగా టెంపరరీ రిజిస్ట్రేషన్ (టీఆర్) ధ్రువీకరణ పత్రాల జారీ, అనుమతుల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. ఇప్పటికే ఓ అధికారిపై వేటు వేసిన ప్రభుత్వం ఇందులో పాత్రధారులు, సూత్రధారులు ఎవరన్నది తేల్చేందుకు ఇంటలిజెన్స్ ద్వారా ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో తీగలాగే కొద్ది డొంక కదులుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. అధికారుల కళ్లు కప్పి అడ్డదారిలో దళారులు సీసీఐకి పత్తిని విక్రయించినట్లు స్పష్టమవుతోంది. దీంతో అవినీతి, అక్రమాలకు పాల్పడిన అధికారుల మెడకు ఉచ్చు బిగుస్తోంది. అయితే ఓ మార్కెట్ అధికారిపై మాత్రమే వేటు వేసి నకిలీ ధ్రువీకరణ పత్రాలను జారీ చేసిన అధికారులను వదిలేయడంపై బిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అసలు సూత్రధారులు వ్యవసాయ శాఖ అధికారులేనని తెలుస్తున్నా ఉన్నతాధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు లేక పోలేదు. ఈ అక్రమ బాగోతంపై విజిలెన్స్ విచారణ చేపట్టి మరింత లోతుగా దర్యాప్తు జరిపితే భారీ అక్రమాలు బయట పడే అవకాశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

(మిగతా 6వ పేజీలో)


ఆడే మంజేష్‌కుమార్ అనే కౌలు రైతుకు ఇచ్చోడ మండల ఏవో ఇచ్చిన టీఆర్ ధ్రువీకరణ పత్రం

ఈ ఫోటోలో కనిపిస్తున్న టీఆర్ ధ్రువీకరణ పత్రం క్రమ సంఖ్య 11002 దీనిని 2024 డిసెంబరు 28న ఆడే మంజేష్‌కుమార్, రాంపూర్ గ్రామం, ఇచ్చోడ మండలానికి చెందిన కౌలు రైతుగా ధ్రువీకరిస్తూ ఇచ్చోడ మండల ఏవో టీఆర్‌ను జారీ చేశారు. అయితే సిరికొండ మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన మడావి రాజు సర్వే నెంబర్ 1/184/అ, 2 ఎకరాల 28 గుంటల విస్తీర్ణం అలాగే 1/184/ఆ సర్వే నెంబర్‌లో 8.0400 గుంటల భూ విస్తీర్ణం మొత్తం 10.3200 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని పత్తి పంటను సాగు చేసినట్లు ధ్రువీకరించాడు. అయితే మడావి రాజు కుటుంబం మాత్రం ఎవరికి తమ భూమిని కౌలుకు ఇవ్వలేదని స్పష్టం చేస్తున్నారు. అలాగే ఆడే మంజేష్‌కుమార్ బజార్‌హత్నూర్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన వ్యక్తిగా తెలుస్తోంది. ఇచ్చోడ మండలంలో అసలు రాం పూర్ అనే గ్రామమే లేదని అధికారులు చెబుతున్నారు. మంజేష్‌కుమార్ ప్రస్తుతం ఇచ్చోడ మండల కేంద్రంలో పత్తి వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తోంది. రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తిని బినామీ రైతుల పేరిటా అడ్డ దారిలో అధికారుల అండదండతో సుమారుగా 120 క్వింటాళ్లకు పైగా పత్తిని సీసీఐకి విక్రయించినట్లు స్పష్టమవుతోంది. ఇలా జిల్లాలో ఎందరో మంది దళారులు సీసీఐకి పత్తిని విక్రయిస్తూ అధికారులను తప్పుతోవ పట్టిస్తున్నారు.

మండల ఏవోకు ధ్రువీకరించే అధికారం లేదు


- శ్రీధర్ స్వామి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, ఆదిలాబాద్

టీఆర్ ధ్రువీకరణ పత్రాలను జారీ చేసే అధికారం మండల వ్యవసాయ అధికారికి లేదు. గ్రామ స్థాయిలో విధులు నిర్వహించే ఏఈవోలు మాత్రమే క్షేత్రస్థాయిలో ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఇచ్చోడ మండల కేంద్రంలో జరిగిన అవకతవకలు, అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. ఓ మండల అధికారి మరో మండలానికి చెందిన కౌలు రైతులను గుర్తించి ధ్రువీకరించే అవకాశమే ఉండదు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.


రాథోడ్ అనిత అనే కౌలు రైతుకు ఇచ్చోడ మండల ఏవో జారీ చేసిన టీఆర్ ధ్రువీకరణ పత్రం

ఈ ఫోటోలో కనిపిస్తున్న టీఆర్ ధ్రువీకరణ పత్రం క్రమ సంఖ్య 12351 దీనిని 2024 నవంబరు 23న రాథోడ్ అనిత, దాబా(కె) గ్రామం ఇచ్చోడ మండలానికి చెందిన కౌలు రైతుగా ధ్రువీకరిస్తూ ఏవో, రెవెన్యూ ఆర్ఐ టీఆర్ పత్రాన్ని జారీ చేశారు. దాబా(కె), సల్యాద గ్రామాలకు చెందిన రాథోడ్ సీతాబాయి, చిత్రం మారుబాయి, బిక్కుబాయి అనే రైతులకు చెందిన 23 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని రాథోడ్ అనిత పత్తి పంటను సాగు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కానీ ఈ రైతులెవరు తమ భూమిని కౌలుకు ఇవ్వలేదని తెలుస్తోంది. రాథోడ్ అనిత భర్త ప్రస్తుతం ఇచ్చోడ మండల కేంద్రంలో ఓ ఫర్టిలైజర్ దుకాణాన్ని నడుపుతున్నట్లు తెలిసింది. ఒక్కో ఎకరానికి 12 క్వింటాళ్ల చొప్పున సుమారుగా 276 క్వింటాళ్ల పత్తిని సీసీఐకి విక్రయించినట్లు తెలుస్తోంది. ఇందులో వ్యవసాయశాఖ, రెవెన్యూ అధికారులు అడ్డదారిలో టీఆర్ పత్రాన్ని జారీ చేసి సహకరించినట్లు స్పష్టమవుతోంది.

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ గోడంనగేష్


వినతిపత్రం అందిస్తున్న ఎంపీ గోడంనగేష్

ఆదిలాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి అశ్వినికుమార్‌ని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గోడంనగేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గల పలు అభివృద్ధి పనులపై మంత్రికి వినతి పత్రాలు అందజేశారు. ఆర్మూర్-ఆదిలాబాద్ వయా నిర్మల్ రైల్వేలైన్ సర్వేపనులు పూర్తి అయినవి, డీపార్, అంచనాలను ఎస్‌సీఆర్ సికింద్రాబాద్ నుంచి తెప్పించి త్వరలో మంజూరు ఇవ్వాలని కోరారు. అలాగే రెబ్బన వద్ద గల ఎల్‌సీహెచ్ ఆర్‌ఓబీ టెండర్స్ పూర్తిచేసి పనులు ప్రారంభించాల న్నా రు. ఖాజీపేట్ నుంచి హౌరా (పెద్దపల్లి, మంచి ర్యాల్, కాగజ్‌నగర్ మీదుగా) కొత్త రైలు వేయా లని, భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌ను సిర్పూర్ (టీ)వర కు పొడగించి, నాందేడ్ నుంచి కొన్ని రైళ్లను ఆదిలాబాద్ వరకు పొడగించాలని, కాగజ్ నగర్ స్టేషన్‌కు అమృత్ పథకంలో అభివృద్ధి పనులు చేపట్టి, బాసర్, రెబ్బెన, కాగజ్‌నగర్ స్టేషన్‌లలో పలు రైళ్లను ఆపాలని వినతి పత్రాలు అందించినట్లు తెలిపారు. ఈ విషయాల పై సంబంధిత శాఖలోని అధికారులకు ఆదేశాలు మంత్రి ఇచ్చినట్లు తెలిపారు.

గిరిజనుల అభివృద్ధి కోసం పీఎంజన్‌మన్ యోజన



ప్యాడ్స్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

ఉట్నూర్, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కోలాం, తోటి గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం ప్రధానమంత్రిజన్‌మన్ యోజన పథకం ప్రవేశ పెట్టినందున జిల్లా అధికారులు లక్ష్యం సాధించేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. గురువారం పీఎంజన్‌మన్‌యోజన పథకంపై ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాంబ ర్‌లో జిల్లా కలెక్టర్ రాజార్షిషా, ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా సంబంధిత శాఖల అధికారులతో కన్వర్జెన్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న మారుమూల ప్రాంతాల్లోని గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జన జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్మన్ యోజన) పథకం ప్రవేశ పెట్టిందన్నారు. ఈ పథకం మారుమూల ప్రాంతాల పీవీటీజీలను గుర్తించి సంక్షేమ అభివృద్ధి పథకాలు అందించే దిశగా ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో 22 మల్టీపర్పస్ సెంటర్లు మంజూరు కాగా అందులో 4 మల్టీపర్పస్ సెంటర్లు పూర్తిచేశామని, పూర్తయిన సెంటర్లలో అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. అలాగే 197 హ్యాబిటేషన్‌లలో 90 హ్యాబిటేషన్ సోలార్ పవర్‌కి సంబంధించి క్వాలిటీ పారామీటర్‌లను పయోగించి ఏర్పాటు చేశామని, అలాగే ఇప్పటివరకు కరెంట్ సరఫరా లేని హ్యాబిటేషన్స్ ఏమైనా ఉంటే సర్వేచేసి నివేదికలు పంపాలన్నారు. సంబంధిత శాఖల వారీగా 15 రోజుల్లో తమ నివేదికలను పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ పాలొన్నారు అలాగే ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో పాత కోర్టు భవనంలో ఏర్పాటు చేసిన శానిటరీ నాప్కిన్స్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజార్షిషా, ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తాలు ప్రారంభించారు.

నీటి శుద్ధీకరణ ప్లాంట్ ప్రారంభం

ఆదిలాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ ప్రాథమిక పాఠశాలలో బాల వికాస్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన నీటి శుద్ధీ కరణ ప్లాంట్, గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ప్రారంభించారు. అనంతరం జ్యోతిప్రజ్వలన గావించి జిల్లా కలెక్టర్ మాట్లాడారు. యాపల్‌గూడా ప్రాథమిక పాఠశాల జిల్లాలో బెస్ట్ పాఠశాల అని అభినందించారు. పాఠశాలలో అన్ని మౌలిక వసతుల కల్పనలో, విద్యార్థుల ప్రతిభ పాఠశాలలో ముందుందని కొనియాడారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి ప్రణీత, ప్రధానోపాధ్యాయులు గంగన్న, ఎంఈవో నర్సయ్య, సుజిత్‌ఖాన్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పార్వతి పాల్గొన్నారు.


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

నిత్యావసర సరుకుల పంపిణీ


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న సొసైటీ సభ్యులు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ స్మైల్ సొసైటీ ఆధ్వర్యంలో ఓ పేద కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన గజ్జల పోతన్న అనేవ్యక్తి ఇటీవల మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి స్మైల్ సొసైటీ వారు గురువారం ఇంటికి వెళ్లి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. పేద కుటుంబానికి తమవంతుగా సహాయం చేస్తున్నట్లు సొసైటీ అధ్యక్షులు కేమ శ్రీకాంత్ పేర్కొన్నారు. కార్యక్రమంలో భూరె సురేష్, సాయి గౌడ్, రామకృష్ణ, సంతోష్‌రెడ్డి, సీతారాం, కిరణ్, నజీర్, అఫ్సర్, నవీన్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత : బోథ్ ఎమ్మెల్యే


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

బజార్‌హత్నూర్ రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. గురువారం బజార్ హత్నూర్ మండల పరిధిలోని కొల్హారి గ్రామంలోని ఫులాజి బాబా ఆలయ 18వ వార్షికోత్సవంలో భాగంగా ఆయన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో జీవించినప్పుడే మానసిక రుగ్మతలకు ఆస్కారం లేకుండా ప్రశాంత జీవనాన్ని పొందుతారన్నారు. ఆధ్యాత్మికతతో జీవించిన ఫులాజిబాబా చేసిన బోధనలతో అనేక మంది ఆధ్యాత్మికత వైపు రావడానికి ఆయన ఎంతో కృషి ఫలితంగానే ఊరూరా ఆయన మందిరాలను నిర్మించుకుని స్మరించుకుంటున్నారని తెలిపారు. ఆలయానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందిస్తానని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ కానిందె రాజారాం, కాంగ్రెస్ మండల కన్వీనర్ జల్కె పాండురంగ్, మండల నాయకులు చిల్కూరి భూమన్న, రియాజ్‌ఖాన్, శరత్ కృష్ణ, ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

తాటిగూడలో కుష్ఠు నివారణపై అవగాహన


మాట్లాడుతున్న జిల్లా కుష్ఠు నివారణ అధికారి గజానన్

ఆదిలాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ కుష్ఠురహిత సమాజ నిర్మాణానికి కృషిచేయాలని జిల్లా కుష్ఠు నివారణ అధికారి గజానన్ పిలుపునిచ్చారు. గురువారం స్పర్శ్ కుష్ఠు నివారణ పక్షోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా కేంద్రంలోని తాటిగూడలోని ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుష్ఠు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స తీసుకుంటే ఎలాంటి వైకల్యం కలగదన్నారు. డిప్యూటీ పారా మెడికల్ అధికారులు వామన్‌రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలతో సమావేశం


రాజకీయ పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఉట్నూర్, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ 2025 ఎన్నికలకు సంబంధించి ముసాయిదా పోలింగ్‌స్టేషన్ల జాబితాను ప్రకటించామని ఉట్నూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాంప్రసాద్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలీసుస్టేషన్‌లో ముసాయిదా జాబితా అందిస్తున్నామని వీటిపై అభ్యంతరాలుంటే తెలుపాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీవో సుధీర్‌రెడ్డి, ఆఫీస్ సూపరింటెండెంట్ శ్యాంసుందర్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పంద్రాజైవం తరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్య క్షుడు మహమ్మద్ ఖయ్యుమ్, ఎంఐఎం మండల అధ్యక్షుడు పాల్గొన్నారు.

బోథ్:మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రమేష్ ఆధ్వర్యంలో రాజకీయ పక్షాల వారితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయ పక్షాల వారికి మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలు, 50 పోలింగ్‌స్టేషన్లను ఏర్పాటు చేశామని ఎంపీడీవో వివరించారు. అభ్యంతరాలుంటే తెలపాలని సూచించారు. సోనాల మండల కేంద్రంలో ఎంపీడీవో రాజేశ్వర్ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల వారితో సమావేశం నిర్వహించి ఎంపీటీసీ స్థానాలు పోలింగ్‌స్టేషన్ల వివరాలను వివరించారు. ఏమైనా అభ్యంతరాలుంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

ఆదిలాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలు, లబ్దిదారుల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆదిలాబాద్ రూరల్ మండల ప్రత్యేక అధికారి పద్మభూషణ్ రాజు అన్నారు. గురువారం ఆదిలాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి బహిరంగ విచారణ ప్రజావేదికను నిర్వహించారు. ఇక్కడి ప్రజావాణి సమాచార సహాయ కేంద్రానికి వచ్చిన సంబంధిత అధికారిణి పిలిపించి వారి సమక్షంలో విచారణ చేపట్టారు. ఒక్కో అర్జీదారు తమ సమస్యను వివరించగా సంబంధిత అధికారితో అప్పటికప్పుడు సమాధానాలు చెప్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, తహసీల్దార్ గోవింద్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శిగా గజానంద్

ఆదిలాబాద్, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): సీసీఐ పత్తి కొనుగోళ్లలో అవినీతి అక్రమాలు జరిగినట్లు గుర్తించిన ప్రభుత్వం ఆదిలాబాద్ మార్కెట్ కార్యదర్శి కాంబ్లె మధుకర్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. దీంతో జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్‌కు ఇన్‌చార్జి కార్యదర్శి బాధ్యతలను అప్పగిస్తూ ఆదేశాలను జారీ చేసింది. దీంతో గురువారం గజానంద్ తాత్కాలికంగా మార్కెట్ కార్యదర్శి ఇన్‌చార్జి బాధ్యతలను చేపట్టారు. పూర్తి స్థాయి అధికారిని ప్రభుత్వం నియమించేంత వరకు జిల్లా అధికారి, ఆదిలాబాద్ మార్కెట్ కార్యదర్శి హోదాలో కొనసాగనున్నారు.